మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం
06 అక్టోబర్ 2026
పేజీలు : 4
@mvaartanews
www.mivaartanews.com

# ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలి.





**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ.**

**- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్.**

**ఖమ్మం అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**

ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ ప్రజల అర్జీలను స్వీకరించారు.
తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ బొబ్బిలి భరత్ చంద్ర తనకు పంచాయతీ నుంచి 17 లక్షల 3 వేల 450 రూపాయల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వీటిని త్వరగా చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ పరిశీలించి అక్టోబర్ 10 నాటికి విచారణ నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధులు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఖమ్మం జిల్లాకు చెందిన బోడ యమున తాను బీటెక్ పూర్తి చేశానని, కుటుంబ పరిస్థితుల కారణంగా తనకు ఖమ్మం జిల్లాలో సమీప ప్రాంతాలలో ఏదైనా ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు.
తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీకి చెందిన మామిడాల అనసూర్య తన కోడలు నుంచి జీవనభృతి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. జి. వెంకటస్వామి కాక జయంతి సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ నివాళులు జి. వెంకటస్వామి కాక జయంతి సందర్భంగా సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభానికి ముందు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళు లర్పించారు. ఈ సందర్భంగా జి. వెంకటస్వామి కాక సేవలను, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని స్మరించుకున్నారు. మంత్రిగా, వివిధ కీలక పదవుల్లో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి, పేదల సంక్షేమానికి జి. వెంకటస్వామి విశేష కృషి చేశారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. కార్మికులు, పేదలు, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం వారు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహనీయుల ఆశయాలు, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా జిల్లా అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల విన్నపాలను త్వరితగతిన పరిష్కరించాలి.

**- అర్హులైన గిరిజనులకు నిర్ణీత గడువులోగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా చొరవ చూపాలి.**

**- ఐటీడీఏ పీవో బి రాహుల్.**

**భద్రాచలం అక్టోబర్ 05 మన మీ వార్త:**





గిరిజనుల నుంచి స్వీకరించే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా ఐటీడీఏ యూనిట్ అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సంబంధిత యూనిట్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఎస్ డి సి ఆనంద్ కుమార్, ఆర్.సి.ఓ గురుకులం అరుణకుమారి, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏ డి ఎం హెచ్ ఓ సైదులతో కలిసి గిరిజనుల నుంచి దరఖాస్తులు మరియు సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, పోడు పట్టాల సమస్యలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను పిఓ కు విన్నవించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపేందుకు గిరిజన దర్బార్ కీలక వేదికగా పనిచేస్తుందన్నారు. గిరిజన దర్బార్ లో ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని ఆయన అన్నారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ గిరిజన దర్బార్ దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఐటీడీఏ యూనిట్ అధికారులను ఆదేశించారు. గిరిజనులు గిరిజన దర్బార్ లో దరఖాస్తులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయవచ్చని ఆయన అన్నారు.

**గిరిజన దర్బార్లో గిరిజనులు సమర్పించిన అర్జీలు.**

ఈరోజు గిరిజన దర్బార్ కు ఎక్కువ శాతం గిరిజనులు పోడు భూముల పట్టాల కొరకు, గిరి వికాసం ద్వారా సబ్సిడీపై కరెంటు, బోరు, మోటార్ల కొరకు, పోడు భూముల పట్టాలు ఆన్లైన్ చేసి పేర్లు మార్పు కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించు కోవడానికి ఆర్థిక వేసులుబాటు కల్పించుట కొరకు, గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి బోరు, మోటార్లు ఇప్పించుట కొరకు, మారుమూల ప్రాంత గిరిజన గ్రామాలకు వెళ్లడానికి రోడ్డు, కరెంటు సౌకర్యం కల్పించుట కొరకు, వితంతు, ఒంటరి మహిళ ఆసరా పెన్షన్లు ఇప్పించుట కొరకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో జీవనోపాధి పెంపొందించుకోవడానికి వ్యక్తిగత శిక్షణలు ఇప్పించుట కొరకు అలాగే దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం అందించుట కొరకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీవో పవర్ వేణు, పివిటిజి అధికారి గన్యా, ఏవో సున్నం రాంబాబు, జేడీఎం హరికృష్ణ, మిషన్ భగీరథ ఏ ఈ ఈ వసుంధర, ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య, హౌసింగ్ ఏఈ హేమంత్, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది నాగేశ్వరరావు, విజయ్, వెంకటేశ్వర్లు, ముత్యాలు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# మాదారంలో సామూహిక సీమంతాలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి మాదారం గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్.





**కారేపల్లి అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాదారం గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ అన్నారు. మండల పరిధిలోని మాదారం గ్రామంలో అంగన్వాడీ టీచర్తుమ్మలపల్లి అనంతమ్మ ఆధ్వర్యంలో రామాలయంలో గేట్ కారేపల్లి సెక్టార్ పరిధిలోని నాలుగు కేంద్రాల నుండి 8 మంది గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాల వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అజ్మీర ఉమా నరేష్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడమే కాకుండా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు వేడుక జరిపించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ దేవేంద్రమ్మ, టీచర్లు జమీల బెగం, సమత, బి పద్మ, నీల సునీత, టీ నాగేంద్ర, జ్యోతి, స్వరూప, పద్మ, ఏఎన్ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 13 వరకు అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ లో చేరుటకు చివరి అవకాశం.

**సత్తుపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి:**



జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో నిర్వహించబడుతున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ నందు 2026-27 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాల నిమిత్తం గడువు ఈ నెల 13 వరకు కలదని కోఆర్డినేటర్ డా. చీపు పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. డిగ్రీలో అడ్మిషన్ పొందుటకు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఓపెన్ ఇంటర్,డిప్లొమా పాసైన విద్యార్థులు అర్హులని ఆయన అన్నారు.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో చదవాలనుకునే ఎస్.టి కోయ, చెంచు, గోండు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ విద్యార్థులకు ఉచిత డిగ్రీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ డిగ్రీ చేయలేనివారు ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్యలో పొందిన డిగ్రీకి రెగ్యులర్ విద్యలో పొందిన డిగ్రీతో సమానమైన అవకాశాలు ఉంటాయని వివరించారు. డిగ్రీ రెండవ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు ఈనెల13 లోపు చెల్లించాలని తెలిపారు.మరిన్ని వివరాలకు 9491881910, 8187837058 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

## నారాయణ పాఠశాల విద్యార్థి ఈ. వరుణ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక.

**ఖమ్మం అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**




ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికల్లో నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ. వరుణ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.జిల్లా స్థాయి ఎంపికల్లో తన క్రీడా ప్రతిభను చాటుకున్న వరుణ్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. అదేవిధంగా ఖమ్మం అర్బన్ సౌత్ అథ్లెటిక్స్ పోటీలలో వంద మీటర్ల పరుగు పందెంలో పి. శశాంక్ మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగింది. వీరిని ఖమ్మం నారాయణ విద్య సంస్థల ఏ.జీ.ఎం ఎస్.రాంకీ గారు, ఆర్. ఐ క్రాంతి కుమార్, హై స్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా వరుణ్ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు చందు, పావని పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బీరపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం.

**సత్తుపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి:**



బీరపల్లి పోషణ మాసం సందర్భంగా బీరపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నలుగురు గర్భిణీ స్త్రీలకు సీమంత కార్యక్రమం నిర్వహించడంతో పాటు ఇద్దరు చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పదిమంది చిన్నారులకు వివిధ పోషకాహార అంశాలపై అవగాహన కల్పించారు,వైస్ సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, సత్యవతి దంపతుల సంరక్షణలో, వారి దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన జీవన విధానంపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయురాలు జమున, హెచ్‌పీ ఉదయ్, ఏఎన్ఎం మారేశ్వరి, అంగన్వాడీ టీచర్లు చంద్రకళ, అవతి, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, ఆయాలు దేవి, నాగలక్ష్మి, వెంకటమ్మ, వీవోలు నాగమణి, సీతారత్నం, ఆశా కార్యకర్త స్వాతి తదితరులు పాల్గొన్నారు. గర్భిణీలు, తల్లులు, చిన్నారుల తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేశారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- సర్పంచ్ పద్మావతి.**

**కారేపల్లి అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**



పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని పేరుపల్లి గ్రామ సర్పంచ్ బానోత్ పద్మావతి అన్నారు. మండల పరిధిలోని పేరుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న, సైడ్ డ్రెయిన్ల దగ్గర బ్లీచింగ్ సోమవారం చల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేస్తే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.గ్రామాలలోని ప్లాస్టిక్ ను వాడకుండా, గుడ్డ సంచులు ఉపయోగించుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడటం సమిష్టి బాధ్యత అని తెలిపారు తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్త, సానిటరీ వ్యర్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కొండపల్లి అనిల్ కుమార్, మల్టీపర్పస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ షేక్ ఖాదర్ బాబా సతీమణి ఉష మృతికి సంతాపం.

**సత్తుపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి:**



సత్తుపల్లి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ షేక్ ఖాదర్ బాబా సతీమణి ఉష హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో, ఆదివారం మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు, జర్నలిస్టులు, రాజకీయ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ సత్తుపల్లిలోని షేక్ ఖాదర్ బాబా నివాసానికి చేరుకుని ఉష పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఖాదర్ బాబా కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబంలో ఒక ఆత్మీయురాలిని కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయమని, ఉష మృతి ఖాదర్ బాబా కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఉష ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఉష మృతి పట్ల సత్తుపల్లి ప్రాంతానికి చెందిన జర్నలిస్టులు, మిత్రులు, బంధువులు, వివిధ వర్గాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఉషారాణి మృతికి మాజీ ఎమ్మెల్యే సండ్ర ఘన నివాళి.

- జర్నలిస్ట్ ఖాదర్ బాబా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి.

**సత్తుపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి:**





సత్తుపల్లి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎస్.కె. ఖాదర్ బాబా సతీమణి జెక్కుల ఉషారాణి ఆదివారం రాత్రి మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సోమవారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ కాలనీలో ఉన్న ఖాదర్ బాబా నివాసానికి వెళ్లి ఉషారాణి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. ఉషారాణి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో తాము వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఖాదర్ బాబా కుమారుడు రాహుల్ మున్సీతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి బాధను పంచుకున్నారు. ఎంతో ఆప్యాయంగా మెలిగే ఉషారాణి ఇక లేరన్న వార్త బాధాకరమని సండ్ర పేర్కొన్నారు. జీవిత భాగస్వామిని కోల్పోయిన ఖాదర్ బాబా కుటుంబ సభ్యులకు ఈ లోటు తీరనిదని, ఈ కష్ట సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు గుండె ధైర్యం, మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఉషారాణి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. జర్నలిస్ట్ ఖాదర్ బాబా కుటుంబానికి సండ్ర వెంకట వీరయ్య అందించిన పరామర్శ ఆ కుటుంబానికి కొంత ధైర్యాన్ని కలిగించింది. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కూడా ఉషారాణి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నాయకపోడ్ సేవా సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.

**చర్ల అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**



నాయకపోడ్ సేవా సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీ ఎన్నికలు పాల్వంచలో సోమవారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మేసినేని రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గాండ్ల రామచందర్, ప్రధాన కార్యదర్శి పోతిల్లా శంకర్, ఉపాధ్యక్షుడు తంబళ్ల రవి, ముఖ్య సలహాదారు జగ్గ పుల్లయ్య, సంయుక్త కార్యదర్శి పున్నం రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది.

జిల్లా అధ్యక్షుడిగా పాశం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పిట్టల లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా పాలెం సత్యనారాయణ, కాపుల నాగరాజు, సహాయ కార్యదర్శిగా ముప్పిడి రమేష్, కార్యవర్గ సభ్యుడిగా కుర్ల రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులకు రాష్ట్ర నాయకులు, సంఘ ప్రతినిధులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకపోడ్ సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం నూతన కమిటీ సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చర్ల మండల కమిటీ సభ్యులు, నాయకపోడ్ సేవా సంఘం ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పొన్నెకల్లు లో మెగా పశు వైద్య శిబిరం.

- డాక్టర్ జి.నాగులు

**కామేపల్లి అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**



కామేపల్లి మండలం పొన్నెకల్లు గ్రామం లో ఖమ్మం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఐకార్ సహకారంతో మంగళవారం మెగా పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.నాగులు సోమవారం తెలిపారు. పశువుల ఆరోగ్యం పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఉచితంగా పశు వైద్య సేవలను అం దించడం జరుగుతుందన్నారు. రైతులు మెగా వైద్య శిబిరం లో పాల్గొని అవగాహన పొందాలని, పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం కూడా నిర్వహించి నట్లు వెల్లడించారు.

# ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఐటీడీఏ నిధులతో రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలు వితరణ.

- భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు.
- ఐటిడిఎ పిఓ బి రాహుల్.

**భద్రాచలం అక్టోబర్ 05 మీ వార్త:**






నాలుగు రాష్ట్రాల పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐటీడీఏ నిధులతో రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలను అందించడం జరిగిందని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు.

సోమవారం భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీ రాజశేఖర్ రెడ్డికి ఆస్పత్రికి ముఖ్యమైన పరికరాలైన కంటి పరీక్షా పరికరం, బ్లడ్ టెస్టింగ్ మిషన్, ఈసీజీ మిషన్, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ట్రేలు, ఆక్సిజన్ సిలిండర్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ... ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి, నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వైద్య పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు.

ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అందించిన వైద్య పరికరాల ద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో సైదులు, ఐసీయూ ఇన్‌చార్జ్ డాక్టర్ జగదీష్, డాక్టర్ మల్లేష్ మరియు హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాణి దుర్గావతి 502 వ జన్మదిన వేడుకలు తెలంగాణా రాష్ట్రం భద్రాచలంలో ఘనంగా నిర్వహించారు.

**భద్రాచలం అక్టోబర్ 05 మన మీ వార్త:**





జాతీయ కోయ - గోండి భాషా ప్రామాణికరణ ౘ డిక్షనరీ 12 వ జాతీయ వర్క్ షాప్ జరుగుచున్న సందర్భంగా దేశ నలుమూలల నుండి వచ్చిన ఆదివాసీలు రాణి దుర్గావతి జయంతి వేడుకలలో పాల్గొన్నారు. భద్రాచలం మార్కెట్ కూడలి వద్ద రాణి దుర్గవతి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు గారు ముందుగా పూలమాలావేసి నివాళులు అర్పించాగా, సత్తిస్గడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఒడిశ, అస్సాం రాష్ట్రాల ప్రతినిదులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, భద్రాచలం లోని గిరిజన భవన్ వద్ద గత నాలుగు రోజులుగా నేషనల్ కోయ - గోండి లాంగ్వేజ్ స్టాండరడైజషన్, డిక్షనరీ ౘ రికాగనైజేషన్ కో-ఆర్డినేటిన్ కమిటీ నిర్వహిస్తున్న వర్క్ షాప్ ను కొనియాడారు. కోయ - గోండి భాషా కు ప్రమానికరణ గుర్తింపు కు నా వంతు కృషి చేస్తానని అన్నారు. భోజన విరామం అనంతరం జరిగిన మధ్యాహన్న సెసన్ లో ముఖ్య అతిధిగా పాల్గొన్న అశ్వరావు పేట శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు గారికి కో- ఆర్డినేషన్ కమిటీ కోయ భాషా గుర్తింపుకు మద్దతు కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోయ భాషా గుర్తింపుకు నా కృషి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో, భద్రాచలం టీం నాయకులు పీసొడి కన్నయ్య, అదిలాబాద్ టీమ్ నాయకులు కొట్నాకి భీమ్రావు, ఆంధ్రా టీమ్ నాయకులు మడివి వీరయ్య, ఒడిశా నాయకులు, ఆనంద్ మడి, చతిస్గడ్ టీం నాయకులు ప్రమోద్ పట్టాయి, మధ్యప్రదేశ్ టీమ్ నాయకులు సుద్దేస్ సింగ్ టేకాం, మహారాష్ట్ర టీమ్ నాయకులు ప్రహ్లాద్ సిడం, అస్సాం టీమ్ నాయకులు ప్రదీప్ పొడియామి సోసైల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు స్థానిక ప్రజలు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించిన భద్రాచలం డీఎస్పీ: యం.అరుణ్ కుమార్.

**భద్రాచలం అక్టోబర్ 05 మన మీ వార్త:**



గత కొంత కాలంగా భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో మొబైల్ ఫోన్లు పోయినట్లుగా ఫిర్యాదులు రాగా, వచ్చిన పిర్యాదుల మేరకు సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో నమోదు చేసి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, రికవరీ చేసిన 32 మొబైల్ ఫోన్లను సంబంధిత బాధితులు/యజమానులకు ఈ రోజు అప్పగించడం జరిగింది. మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం లేదా చోరీకి గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రజలు రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, బస్సులు, రైల్వే స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ ఉంచరాదని, మొబైల్ ఫోన్లు పోయిన లేదా చోరీకి గురైన సమాచారాన్ని వెంటనే పోలీసులకు సమాచారం అందించి, మొబైల్ ఫోన్ ఐఎంఈఐ నంబర్, ఇతర వివరాలను పోలీసులకు అందించాలని ఈ సందర్భంగా డీఎస్పీ యం.అరుణ్ కుమార్ తెలిపారు.

## భూవివాదం ఇరువురి అంగీకారం తో పరిష్కారం

- కాంగ్రెస్ నేత ఇమ్మడి.

**కారేపల్లి అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**



కారేపల్లి గ్రామం లో పురాతన శివాలయం భూమి కి సంబంధించి సుమారు 10 సంవత్సరాల నుండి వివాదం జరుగుతున్నది. ఈ క్రమంలో శివాలయం నకు సంబంధించిన భూమి శివాలయంనకు ఉండాలని గత 10 సంవత్సరాల క్రితం ఇమ్మడి తిరుపతి రావు నాయకత్వంలోప్రయత్నం చేశారు. ఆ పరిణామంలో ఇమ్మడి తో పాటుమరి కొందరి పై ప్రయివేటు వ్యక్తులు కేసుకు కూడా పెట్టారు. కేసులను కూడా లెక్క చెయ్యకుండా ఈనాటి వరకు శివాలయం భూమి కొరకు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఇదిలా ఉంటే దేవుడి పై మాకు కూడా భక్తి ఉంది అందుకు మేము సహకరిస్తాం అని భూ యజమానులు సోమవారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇమ్మడి తిరుపతి రావు ఆధ్వర్యంలో భూమి ఇచ్చారు. అందుకు భూ యజమానులు లకు ఇమ్మడి తిరుపతి రావు తో పాటు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ సందర్భంగా ఇమ్మడి మాట్లాడుతూకాకతీయుల నాటి ఈ శివాలయం ను మళ్ళీ పునర్నిర్మించి గుడి కి పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని అన్నారు.

## అంగన్వాడీ టీచర్ ఉషారాణి మృతికి సీఐటీయూ సంతాపం.

**సత్తుపల్లి అక్టోబర్ 05 మీ వార్త టౌన్ రిపోర్టర్:**



సత్తుపల్లి అంగన్వాడీ టీచర్ ఉషారాణి గారు మృతి చెందడం పట్ల అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్-- సీఐటీయూ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె మృతి అంగన్వాడీ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు తీరని లోటని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలిక పోగు సర్వేశ్వరరావు నాయకులునాయకులు పేర్కొన్నారు. ఉషారాణి అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ చిన్నారులకు సేవలందించారని, ఆమె సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్, యూనియన్-- సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ఉషారాణి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ యూనియన్ నాయకులు నాగేంద్ర, నాగలక్ష్మి, షకీనా, జ్యోతి, లక్ష్మి, అంగనవాడి టీచర్స్ పాల్గొనే శ్రద్ధాంజలి ఘటించారు.

## రాజుపేట పాములేరు వంతెన వద్ద డైవర్షన్ రహదారి పనులకు శ్రీకారం.

**ములకలపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**



ములకలపల్లి మండల కేంద్రానికి సమీపంలోని రాజుపేట పాములేరు వంతెన వద్ద డైవర్షన్ రహదారి నిర్మాణ పనులకు గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు.

గతంలో తుఫాన్ కారణంగా పాములేరు వంతెన దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి ప్రస్తుతం ఉన్న ప్రత్యామ్నాయ మార్గం ద్వారా రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో వాహనదారులకు ఇబ్బందులు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గుర్తించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో వంతెన సమీపంలోనే డైవర్షన్ రహదారి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి సంబంధిత అధికారులతో మాట్లాడి పనులకు మంజూరు చేయించారు ఇందులో భాగంగా డైవర్షన్ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎండి జహీర్, బత్తుల అంజి, తాండ్ర ప్రభాకర్ రావు, పేటేటి నరసింహరావు, కారం సుధీర్, ఎమ్మార్వో స్వాతి బిందు, ఎంపీడీవో సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు సర్పంచులు ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం టీజేఎంయూ నిరంతర పోరాటం.

- 8న అశ్వారావుపేటలో నియోజకవర్గ ప్రథమ మహాసభ ను జయప్రదం చేయండి.
- టీజేయంయు జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్ కుమార్.

**చర్ల అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**

జర్నలిస్టుల న్యాయమైన హక్కుల సాధన, సంక్షేమం కోసం తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (టీజేఎంయూ) నిరంతరం పోరాటం చేస్తుందని యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాయిడ్స్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించనున్న టీజేఎంయూ అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక యూనియన్ ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించి మహాసభ నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, దిశానిర్దేశం చేశారు. అనంతరం ఇనపనూరి ప్రభాకర్ మాట్లాడుతూ



దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో పలు సంఘాలు ఆశించిన స్థాయిలో స్పందించకపోవడంతో సమస్యలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సొంతింటి కల సైతం నెరవేర్చుకోలేని పరిస్థితుల్లో అనేక మంది జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, రక్షణ కోసం ప్రభుత్వాల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం కోసం టీజేఎంయూ నిరంతర కృషి చేస్తుందని అన్నారు.

నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యూజేఐ) అనుబంధంగా పనిచేస్తున్న టీజేఎంయూ పాత్రికేయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు జర్నలిస్టులు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8న జరగనున్న నియోజకవర్గ ప్రథమ మహాసభకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఇనపనూరి ప్రభాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ రాఘవేంద్ర, ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణీత్ కుమార్, అశ్వారావుపేట నాయకులు నూనె హనుమంతరావు, పెనుగొండ సత్యనారాయణ, నార్లపాటి సుబ్బారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ కడుపుతో పారిశుద్ధ్య పనులు చేయాలా...?

- మూడు నెలలుగా వేతనాలు లేక పస్తులు ఉంటున్న కార్మికులు.
- సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ,జే రమేష్.
- ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల మెరుపు నిరసన.

**భద్రాచలం అక్టోబర్ 05 మన మీ వార్త:**

మూడు నెలలుగా వేతనాలు లేక పిల్లలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుంటే ఆకలి మంటల ఖాళీ కడుపులతో కార్మికులు విధులు ఎలా నిర్వహించాలని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రశ్నించారు. భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి శానిటేషన్ కార్మికులు సెక్యూరిటీ గార్డ్ తదితర తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు మూడు నెలలుగా అందని నేపథ్యంలో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు మెరుపు నిరసనకు దిగారు. ఏరియా ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి శానిటేషన్ పనుల గుత్తేదారుడు కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా గత సంవత్సర కాలంగా వేధిస్తున్నారని అన్నారు. కనీస వేతనం 18,500 ఇవ్వాల్సి ఉండగా కేవలం 11000 మాత్రమే చెల్లిస్తున్న గుత్తేదారుడు ఆ



వేతనం సైతం సకాలంలో ఇవ్వక కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని ఏజే రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సైతం ఇటువంటి సమస్యలే ఎదురైన నేపథ్యంలో పలుమార్లు ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ రాజశేఖరరెడ్డి తో పాటు డిసిహెచ్ రవీంద్ర నాయక్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లామని అయినను పరిస్థితి ఏమాత్రం మారటం లేదని అన్నారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్నటువంటి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రతిరోజు 500 నుండి 800 వరకు ఓపి పేషెంట్లు వస్తున్నారని అంత మంది రోగులకు సేవలందించేందుకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేక పని భారం సైతం అధికంగా పెరుగుతుందని అన్నారు. వైద్యాధికారులు ఈ సమస్యపై స్పందించి నేరుగా కార్మికుల వ్యక్తిగత ఎకౌంట్లో



వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఏజె రమేష్ డిమాండ్ చేశారు. మరో 10 రోజులలో తెలంగాణ అతిపెద్ద పండుగ దసరా వస్తున్న నేపథ్యంలో కార్మికుల ఆకలి బాధలతో ఆటలాడుకోవడం సరైనది కాదని వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని వేలు పక్షంలో నిర్మాధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాజశేఖర్ తో చర్చలు జరిపిన కార్మిక నేతలు వారం రోజుల్లోపు వేతనాలను చెల్లించి సమస్యను పరిష్కరిస్తామని సూపరిండెంట్ హామీ ఇవ్వడంతో నిరసనను నిర్మించారు. ఈ కార్యక్రమంలో సిఐటి పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, శానిటేషన్ యూనియన్ నాయకులు ఎం రమ, నరేందర్, నాగరాజు, కృష్ణ, శోభ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేలకొండపల్లిలో డాక్టర్ అర్జున్, గౌతమ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం.

- పోష్టహారము ప్రాముఖ్యత గురించి అవగాహన సదస్సు.

**నేలకొండపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి:**

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేలకొండపల్లి ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల యందు వైద్యాధికారి డాక్టర్ అర్జున్ గౌతమ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి ఎలుక కాటుతో బాధపడుతున్న విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన టీకాలను ఇప్పించడంతోపాటు విద్యార్థినీ విద్యార్థులకు చిరు వ్యాధులు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సును ఏర్పాటు చేసి వైద్య శిబిరము నిర్వహించడం అయినది



ఈ శిబిరం యందు జ్వరము ఇతర సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి మందులు పంపిణీ చేయడం అయినది. అదేవిధంగా కౌమార దశలు విద్యార్థిని విద్యార్థులకు రక్తహీనత పట్ల అవగాహన పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి వివరించడమైనది. అదేవిధంగా ఎలుక కాటుకు గురైన విద్యార్థిని



విద్యార్థులు ఆరోగ్యవంతంగానే ఉన్నారని ఎటువంటి సమస్య లేదని ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమారి, ఆరోగ్య విస్తరణ అధికారి చంద్రశేఖర్, ఆరోగ్య కార్యకర్త రాణి ఆశా కార్యకర్త సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషే బలం 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల

- ప్రధానోపాధ్యాయులకు ఘన సన్మానం.

**అశ్వారావుపేట అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేట నియోజకవర్గంలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో గండుగులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం వెనుక ఉపాధ్యాయుల కృషి అంకితభావం ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడంతో పాటు వారిలో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం ఉన్నత లక్ష్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఇందుకు ఉపాధ్యాయుల కృషి ప్రధాన కారణమని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో విద్యకు విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో పాఠశాలల్లో అవసరమైన వసతుల కల్పనకు విద్యా ప్రమాణాల పెంపునకు తన వంతు సహకారం అందిస్తున్నానని ఇంకా అందిస్తానని తెలిపారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలలకు మంచి పేరు తీసుకువచ్చిన ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.



దమ్మపేట ఎంఈఓ జగపతి రావు, ములకలపల్లి ఎంఈఓ సత్యనారాయణ, అశ్వారావుపేట ఎంఈఓ ప్రసాద్ రావు, చంద్రుగొండ ఎంఈఓ సూరయ్య, మాజీ ఎంఈఓ కీసరి లక్ష్మీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన డివిజన్ ప్రజల విన్నపాల సమస్యలు పరిష్కరించండి.

- డివిజన్ అధికారులను ఆదేశించిన భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట.

**భద్రాచలం అక్టోబర్ 05 మన మీ వార్త:**




డివిజన్ ప్రజలు వివిధ సమస్యల గురించి ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న అందరికీ సంబంధిత అధికారులు వారి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు వారికి సంబంధించిన వివిధ సమస్యల గురించి నేరుగా ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకుంటే సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి అవకాశం ఉంటుందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు.

సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ అధికారుల సమక్షంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ దరఖాస్తుదారులు కోరిన విధంగా అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలతో పాటు రెవెన్యూ కు సంబంధించిన సమస్యలు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు నిరుద్యోగులకు సంబంధించిన వినతి పత్రాలను వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇందులో ముఖ్యంగా రెవిన్యూ సమస్యలు, పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలతో నిరుద్యోగులు వారికి సంబంధించిన సమస్యల గురించి పరిష్కరించాలని అలాగే పలు రకాల సమస్యలపై ప్రజలు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి ఆన్లైన్ చేసి సంబంధిత డివిజన్ అధికారులకు పంపుతూ, ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాకాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేసి, నిర్ణీత గడువులో పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టాలని, పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ సుధీర్,డి ఏ ఓ భగవాన్ రెడ్డి మరియు భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజారావు దశ దిన కర్మలో కాంగ్రెస్ నాయకుల నివాళులు.

**నేలకొండపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి:**



నేలకొండపల్లి మండలం అమ్మగూడెం గ్రామానికి చెందిన శ్రీరామనేని రాజారావు దశ దిన కర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజారావు మృతి పట్ల నాయకులు విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, లక్ష్మీ నరసయ్య, నంబూరి రామారావు, నరేందర్, అయోధ్య రామయ్య, అడపాల రామారావు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి:సీడీపీవో కవిత

**నేలకొండపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి:**



అంగన్వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కవిత సూచించారు. నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో సోమవారం అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీవో కవిత మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండా రంగయ్య, ఉపసర్పంచ్ రాసాల నవీన్,అంగన్వాడీ కార్యకర్తలు కల్పన, ఉమారాణి, విజయలక్ష్మి,ఉమ తదితరులు పాల్గొన్నారు.

## గుంతేటి వీరభద్రంకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు.

**ఖమ్మం అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**



ఖమ్మంలో సామాజిక ఉద్యమ నేత, మాల మహానాడు సీనియర్ నాయకులు గుంతేటి వీరభద్రం 73వ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు ఆయనకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్,మాల మహానాడు నాయకులు కరాటే వేణు, జమ్మి వీరబాబు తదితరులు గుంతేటి వీరభద్రంను కలిసి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుంతేటి వీరభద్రం ఎన్నో సంవత్సరాలుగా సామాజిక ఉద్యమంలో క్రియాశీలకంగా ఉంటూ సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్‌లోనూ మరింత ఉత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.గుంతేటి వీరభద్రం నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవిస్తూ మరిన్ని సంవత్సరాలు సామాజిక సేవలో ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.

## తెలంగాణ ఉద్యమ వీరుడు గడ్డం వెంకటస్వామి.

**- ఎంపీడీవో సోంలాల్, తాసిల్దార్ శ్రీనివాసరావు.**

**కామేపల్లి అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**



స్వాతంత్ర్య సమరయోధు డు, పేదల పెన్నిధి గడ్డం వెంకటస్వామి (కాకా) తెలంగాణ ఉద్యమవీరు డని, సింగరేణి కార్మిక బాంధవుడని ఎంపీడీవో ధరావత్ సోంలాల్, తాసిల్దార్ కేవీ శ్రీనివాసరావు, ఎం పి ఓ వి వి ఎస్ శాస్త్రి, ఏవో బి.తారా దేవి అన్నారు. సోమవారం



కామేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వెంకట స్వామి 97వ, జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకా చిత్రపటానికి పూలమాలవేసి వారు నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కాకా బహుజన ఆత్మగౌరవ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఇ ఓ జి. వెంకట్, మండల ప్రజా పరిషత్ సూపరిండెంట్ తన్నీరు నరేందర్, సీనియర్ అసిస్టెంట్ పాపారావు, ఏపీఎం ఎం.వెంకట రామారావు, ఏపీవో అద్దంకి శ్రీరాణి, పి ఆర్ ఏ ఈ వేములపల్లి కేశవరావు, ముచ్చర్ల ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ సిహెచ్ కృష్ణ, మండల పరిషత్ సిబ్బంది క్రాంతి కుమారి, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం రఘునాథ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి, మిషన్ భగీరథ వర్క్ ఇన్స్పెక్టర్ అంజం రాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ ప్రజావాణిలో అధికారులకు విన్నవించిన మిషన్ భగీరథ కార్మికులు



**కామేపల్లి అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**



తమకు రావలసిన జీతాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కామేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల కు విన్నవించారు.నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో తాము నానా అవస్థలు పడుతున్నా మని వాపోయారు. వేతనాలు పెంచి చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలను బ్యాంక్ ఎకౌంట్ ద్వారా చెల్లించాలని కోరారు. కామేపల్లి సిపిడబ్ల్యుఎస్ స్కీం కింద పని చేస్తున్న తమను ఇల్లందు సెగ్మెంట్ లోని గ్రిడ్ విభాగంలో చేర్చాలని అన్నారు.ఈ మేరకు వినతి పత్రం ను ఎంపీడీవో ధరావత్ సోంలాల్, తాసిల్దార్ కె వి శ్రీనివాసరావు, మిషన్ భగీరథ గ్రిడ్ కామేపల్లి ఏఈ డి.బాలజీ లకు అందజే శారు.దీంతో వారు స్పందిం చి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. తొలుత కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికుల అసోసియేషన్ మండల అధ్యక్షులు గోకినేపల్లి నాగరాజు, ఉపాధ్యక్షులు చల్లా లక్ష్మయ్య, కోశాధికారి కనికరపు వినయ్, సహాయ కార్యదర్శి గుడిమెట్ల శేఖర్, అసోసియేషన్ సభ్యులు బత్తుల మల్లయ్య, దేవేండ్ల కొండ, తమ్మిశెట్టి సంపత్ కుమార్, చిల్ల కోటేశ్వరరావు, కనికరపు సంపత్, వాంకుడోత్ శ్రీకాంత్, దొంగల పవన్ కుమార్, పుట్టల వెంకటేష్, బొరిగొర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీకగా సీతాయిపల్లి

**దుర్గామాత ఉత్సవాలకు ముస్లిం సర్పంచ్ రూ.15 వేల విరాళం**



**గాంధారి :** మతసామరస్యానికి ప్రతీకగా గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామం నిలుస్తోంది. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు అన్ని పండుగలను కలిసిమెలిసి నిర్వహించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నిర్వహించనున్న దుర్గామాత ఉత్సవాలకు ముస్లిం సోదరుడైన గ్రామ సర్పంచ్ పఠాన్ అంజద్‌ఖాన్ ఆర్థిక సహాయం అందించి సోదరభావాన్ని చాటుకున్నారు.నవజవాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహ ఏర్పాటు నిమిత్తం గ్రామ సర్పంచ్ పఠాన్ అంజద్‌ఖాన్ స్వయంగా రూ.15 వేల ఆర్థిక విరాళాన్ని అందజేశారు.మతాలతో సంబంధం లేకుండా గ్రామంలో నిర్వహించే పండుగలకు సర్పంచ్ అంజద్‌ఖాన్ అందిస్తున్న సహకారాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి పండుగలను నిర్వహించుకోవడం ద్వారా గ్రామంలో మతసామరస్యం, సోదరభావం మరింత బలపడుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు.దుర్గామాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు.ఈ కార్యక్రమం లో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో ఎలకల భయం విద్యార్థినులకు భద్రత ఏదీ?

**- 10 మంది విద్యార్థినులకు ఎలుకల కాటు..**
**- ఆసుపత్రిలో వైద్య పరీక్షలు.**
**- అధికారుల నిర్లక్ష్యంపై పీడీఎస్‌యూ ఆగ్రహం..పాఠశాల వద్ద ధర్నా..**

**నేలకొండపల్లి అక్టోబర్ 05 మీ వార్త ఆర్ సి:**





నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఎలుకల బెడద కలకలం రేపింది.శనివారం రాత్రి నిద్రిస్తున్న పదో తరగతి విద్యార్థినుల్లో పది మందిని ఎలుకలు కరిచిన ఘటనతో పాఠశాలలో ఆందోళన నెలకొంది.విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకల కాటుకు గురైన లిఖిత,లాస్య, శర్మిళ,రజిని,గీతిక, సానియా, సాయిపూర్విత, పుణ్యవతి, జ్యోషిక, వెన్నెలకు ఆదివారం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వైద్యాన్ని అందించారు.ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ అర్జున్ గౌతమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.

**పాఠశాలను సందర్శించిన అధికారులు.**

ఘటన విషయం తెలుసుకున్న గురుకుల సంస్థ ఉప కార్యదర్శి అరుణకుమారి, ప్రాంతీయ అధికారి అపూర్వ పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారిని ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఎలుకల సంచారానికి పారిశుద్ధ్య లోపాలు కారణమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థినులు నిద్రించే గదుల్లో ఎలుకల బెడద ఉండటంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదంటూ ఆగ్రహం.**

ఎలుకలు కరిచిన విషయం విద్యార్థినుల తల్లిదండ్రులకు వెంటనే సమాచారం ఇవ్వలేదని ఆరోపిస్తూ పీడీఎస్‌యూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నాయకులు గురుకుల పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలితో వాగ్వాదానికి దిగారు.

విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, ఘటనపై గురుకుల ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని పీడీఎస్యూ నాయకులు డిమాండ్ చేశారు.గురుకుల జిల్లా అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. విద్యార్థినుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఎలుకల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# మండల స్థాయి ప్రజావాణికి అధికారుల డుమ్మా!

**- కింది స్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులుపుకుంటున్న వైనం.**
**- ఆర్అండ్‌బీ అధికారుల పనితీరుపై ఫిర్యాదుల పరంపర.**

**నేలకొండపల్లి అక్టోబర్ మీ వార్త ఆర్ సి:**



నేలకొండపల్లి మండల కేంద్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రాంప్రసాద్,ఎంపీడీఓ ఎం.యర్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణికి మండల స్థాయి అధికారులు పలువురు గైర్హాజరయ్యారు. తమకు బదులుగా కింది స్థాయి సిబ్బందిని పంపించి బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండల వ్యవసాయ అధికారి మినహా మిగతా శాఖలకు చెందిన పలువురు అధికారులు స్వయంగా హాజరుకాకుండా తమ సిబ్బందిని పంపించారు. మరికొన్ని శాఖల అధికారులు కనీసం సిబ్బందిని కూడా ప్రజావాణికి పంపకపోవడం గమనార్హం.ఇంకొందరు అధికారులు సమయపాలన పాటించకుండా, కార్యక్రమానికి వచ్చామన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇదిలా ఉండగా, ఆర్అండ్‌బీ అధికారుల పనితీరుపై ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రతిసారి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన పాగర్తి సుధాకర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కనీసం సమస్యపై వివరాలు తెలుసుకునేందుకు జూనియర్ ఇంజినీర్ స్థాయి అధికారి కూడా ప్రజావాణికి హాజరుకావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, తిరుమలాపురం పంచాయతీల పరిధిలో రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన విభజకాల్లోని విద్యుత్ దీపాలు వెలగడం లేదని,ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని సుధాకర్ ఆరోపించారు. సంబంధిత దీపాలను పంచాయతీలకు అప్పగించి నిర్వహణ బాధ్యతలు అప్పగించారా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఎం. యర్రయ్య హామీ ఇచ్చారు.ప్రజావాణిలో వివిధ సమస్యలపై పలువురు అధికారులు, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి కొత్తగూడెం పేరు పెట్టాలని డిమాండ్.

**- అఖిలపక్ష నేతలు అదనపు కలెక్టర్ పి.శ్రీజకు వినతి.**

**ఖమ్మం అక్టోబర్ 05 మీ వార్త ప్రతినిధి:**





కొత్తగూడెం రెవెన్యూ పరిధిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపం ఇతర నిర్మాణాలకుసంబంధించిన శిలాఫలకాలపై కొత్తగూడెం పేరు పెట్టాలని ఖమ్మం నగరంలోని కొత్తగూడెం ప్రాంతానికి చెందిన 14వ మరియు 15వ డివిజన్ల అఖిలపక్ష నేతలు పగడాల మల్లేష్,యర్రబోయిన గోవిందరావు, చేతుల నాగేశ్వరరావు, మొర్రిమేకల కోటయ్య,రావుల హనుమంతరావు, డిమాండ్ చేస్తూ ఈరోజు ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ టి. శ్రీజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం రెవెన్యూ పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం,కళ్యాణ మండపం తదితర నిర్మాణాలు చేపడుతున్న విషయం విదితమే. అయితే, ఈ నిర్మాణాలకు సంబంధించి పత్రికా ఇతర ప్రచార మాధ్యమాలలో ఈ ప్రాంతాన్ని అల్లీపురం పేరుతో పెర్కొనడం స్థానిక ప్రజల దృష్టికి వచ్చిందని తెలిపారు. వాస్తవానికి, దేవాలయ నిర్మాణం జరుగుతున్న స్థలం,పి.బి. నగర్ ప్రాంతం మరియు సంబంధిత భూములు, సర్వే నంబర్లు అన్నీ కొత్తగూడెం రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయన్నారు.అటువంటప్పుడు, కొత్తగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఆధ్యాత్మిక కట్టడాలకు అల్లీపురం పేరును మాత్రమే ప్రస్తావించడం వల్ల స్థానిక ప్రజలలో కొంత అసంతృప్తి నెలకొంటోంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశంగా మారిందని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను వాస్తవ రెవెన్యూ పరిధిని పరిగణనలోకితీసుకొని, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపం ఇతర నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలు, ప్రారంభోత్సవ ఫలకాలు, అధికారిక రికార్డులు, ప్రచార ప్రకటనలు ఇతరత్రా అన్ని సందర్భాలలో కొత్తగూడెం లేదా కొత్తగూడెం అల్లిపురం రోడ్డు అనే పేరును స్పష్టంగా పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కొత్తగూడెం ప్రాంత ప్రజలు అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు స్థానిక పెద్దల సమక్షంలో చర్చించి, ఏకాభిప్రాయంతో తీర్మానం చేయడం జరిగిందని మంత్రి ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి,కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అఖిల పక్ష నాయకులు మాకెనబోయిన నాగేశ్వరరావు, పల్లెబోయిన పుల్లారావు, బొమ్మిశెట్టి లక్ష్మినర్సయ్య, పొదిల ఉపెందర్, యర్రబోయిన వెంకటయ్య, నాగటి శేషయ్య, పర్వత సైదులు, పొదిల రామారావు, బొమ్మిశెట్టి భాస్కర్, చామకూరి శంఖర్, చిర్ర శంఖర్, పడగాల వెంకటేశ్వర్లు, దంతాల నాగరాజు, షేక్.మీరా, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, లింగనబోయిన దాసు, బండ్ల వెంకటేశ్వర్లు, కర్రి కృష్ణ,మొర్రిమేకల వెంకటనారాయణ, అమరయ్య, చిగంటి శ్రీను, పగడాల అనంతరాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఏఎఫ్ కాంట్రాక్టు లభిస్తే.. భారత్‌లో విమానాల తయారీ!



**వాషింగ్టన్/దిల్లీ:** భారత వాయుసేన (ఐఏఎఫ్) కోసం మధ్య తరహా రవాణా విమానాల సరఫరా కాంట్రాక్ట్ కనుక తమకు లభిస్తే, భారత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా దిగ్గజ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్ సీనియర్ అధికారి వెల్లడించారు. 60 మధ్య తరహా రవాణా విమానాలు కొనుగోలు చేసేందుకు 10.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్ల) అంచనా వ్యయంతో, మనదేశం ఆగస్టులో టెండర్ జారీ చేసింది. ఈ కాంట్రాక్ట్ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), మహీంద్రా గ్రూప్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), రిలయన్స్ డిఫెన్స్ సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ భారతీయ సంస్థలు అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ ప్రాజెక్టు బిడ్డింగ్‌లో పాల్గొంటున్నాయి.

**హైదరాబాద్‌లో ఇప్పటికే**

లాక్‌హీడ్ మార్టిన్‌కు టీఏఎస్ఎల్‌తో దీర్ఘకాలంగా భాగస్వామ్యం ఉంది. హైదరాబాద్-వడోదరలో టాటాతో కలిసి సంయుక్తంగా నెలకొల్పిన టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ప్లాంట్లున్నాయి. సీ-130జే విమానాలకు వివిధ విడిభాగాలు, వెనుక భాగంలోని నిర్మాణాలను తయారు చేస్తున్నట్లు లాక్‌హీడ్ మార్టిన్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ - స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాన్ టెన్నీ తెలిపారు. కొత్త ఆర్డర్ లభిస్తే ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. విమానాల తయారీతో పాటు ఇతర కార్యకలాపాలు కూడా భారత్‌లోనే జరిగేలా చూస్తామన్నారు. లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 60 విమానాల్లో 12 విమానాలను పూర్తిగా సిద్ధం చేసిన స్థితిలో భారత్‌కు అందిస్తారు. మిగిలిన 48 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తామని కంపెనీ ప్రతిపాదించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటికే వినియోగిస్తున్న 12 సీ-130జే విమానాలను కూడా అధునాతన కాన్ఫిగరేషన్‌కు అప్‌గ్రేడ్ చేస్తామనీ లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలైతే, ఐఏఎఫ్ వద్ద ఒకే రకమైన అధునాతన కాన్ఫిగరేషన్ కలిగిన మొత్తం 72 విమానాలుంటాయి.